సాక్షి
మహబూబాబాద్
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



పసుపు ధర పైపైకి..
కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపు ధర రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం క్వింటాల్‌కు రూ.11,352 ధర పలికింది.
- 8లో▸



సైబర్ నేరగాళ్లు..
మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలు నయా పంథాలో సాగుతున్నాయి. జాన్సన్ అండ్ జాన్సన్స్ ఉత్పత్తులను చూపి రూ.కోట్లు లూటీ చేస్తున్నారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$31.3^0/25.1^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తొర్రూరు డీఎస్పీగా రఘు



తొర్రూరు: తొర్రూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (డీఎస్పీ)గా రఘు నియామకమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీ, ఏసీపీల బదిలీల్లో భాగంగా రఘును తొర్రూరు డీఎస్పీగా తిరిగి నియమిస్తూ సోమవారం డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది మే నుంచి తొర్రూరు డీఎస్పీగా పని చేస్తున్న రఘును ఈ నెల 16న హైదరాబాద్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. అనంతరం కామారెడ్డి డీఎస్పీగా పనిచేసిన విపూరి సురేష్‌ను తొలుత తొర్రూరు డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలు సమీకరణాల నేపథ్యంలో ఆయనను వర్ధన్నపేట ఏసీపీగా నియమించారు. తాజాగా వెలువడిన ఉత్తర్వుల్లో రఘును తొర్రూరు డీఎస్పీగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆయన గతంలో సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీగా పనిచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆసక్తి గల అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రామారావు సోమవారం తెలిపారు. ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు పత్రాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు సంబంధించిన సెక్షన్ అధికారులను సంప్రదించాలన్నారు.

బాధితులను కాపాడిన వారికి సన్మానం




మహబూబాబాద్: ఇటీవల మున్నేరు వాగు వరద ఉధృతితో పక్కనే ఉన్న మామిడి, సపోట తోటలో చిక్కుకున్న మల్లయ్యను కాపాడిన వారితో పాటు పలు కాలనీవాసులను కాపాడిన వారిని కలెక్టర్ శశాంక సన్మానించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాహసవీరులు డొలాగర్ శంకర్, శివకుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్‌తో పాటు పలువురిని కలెక్టర్ శశాంక సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతాలు

మహబూబాబాద్ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్ మహబూబాబాద్ శాఖ వారి ఆధ్వర్యంలో అధిక శ్రావణ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం 9.15గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఏర్పాటు చేశామని ప్రచార మండలి సభ్యుడు యిమ్మడి రవికుమార్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో జరిగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. భక్తులు కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదాలు, భోజనాలు స్వీకరించాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

రైల్వే అధికారులు పరిశీలించాలి



డోర్నకల్: మున్సిపాలిటీ పరిధి సుభాష్‌వీధిలోని రైల్వే స్థలంలో గోడ నిర్మాణం కోసం తవ్విన గుంతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే అధికారులు పరిశీలించాలని ఎంపీ మాలోత్ కవిత కోరారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఎంపీ కవిత డీఆర్‌ఎంను కలిసి సమస్యపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైల్వే శాఖ స్థలంలో ఇళ్ల ఎదుట గుంత తవ్వడంతో వృద్ధులు, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యను డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లానని.. పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఎం స్థానిక అధికారులకు ఆదేశించారని ఎంపీ తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

మహబూబాబాద్: ఇంటింటా ఇన్నోవేటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శశాంక కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం వాల్ పోస్టర్లను కలెక్టర్,అధికారులు ఆవిష్కరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన యువకులు, గ్రామీణులు, గృహిణులు,పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు.

విద్యార్థులకు ‘పరీక్ష’

ఉపాధ్యాయుల సర్దుబాటులో అలసత్వం
- ముందుకు కదలని డిప్యుటేషన్ల ఫైల్
- 50 రోజుల క్రితం పాఠశాలల పునఃప్రారంభం
- పలు స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ లేక పాఠాలు కోల్పోతున్న విద్యార్థులు
- పుస్తకాలు తెరవకుండానే పరీక్షలు



‘మహబూబాబాద్ మండలం ముడుపుగల్లు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు ఉంది. ఈ పాఠశాలలో ఇంగ్లిష్, బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా ఏటా పాఠశాల ప్రారంభం నుంచే డిప్యుటేషన్ల ప్రక్రియ చేపట్టే అధికారులు ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పాఠాలు వినకుండానే విద్యార్థులు ఎఫ్‌ఏ-1పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది’.

సాక్షి, మహబూబాబాద్: విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. అయితే ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభమై 50రోజులు దాటినా సర్దుబాటు ప్రక్రియ చేపట్టలేదు. ప్రారంభంలో హడావుడి చేసిన విద్యాశాఖ అధికారులు డిప్యుటేషన్ల విషయంలో వెనకడుగు వేస్తున్నారు. దీంతో పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో పుస్తకాలు తెరవకుండానే విద్యార్థులు ఏఫ్‌ఏ-1పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఈ విషయం విద్యార్థుల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్‌తో ఆటలాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలసత్వం..
జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో 3,690 మంజూరు టీచర్ పోస్టులు ఉన్నాయి. 3,126 మంది పనిచేస్తున్నారు. 564 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటితో పాటు153 పాఠశాలల్లో విద్యార్థులు లేరనే నెపంతో 170మందికి పైగా ఉపాధ్యాయులు వేరే పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే అధికారులు డిప్యుటేషన్ల ప్రక్రియ పూర్తి చేకపోవడంతో కొంతమంది ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటున్నారు. మరికొంత మంది ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల విన్నపం మేరకు స్కూళ్లకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

ముందుకు కదలని ఫైల్..
నెలరోజుల క్రితం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ప్రారంభించిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ఉపాధ్యాయుల మిగులు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని జాబితా తయారు చేసి డిప్యుటేషన్లు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో నోడల్ హెచ్‌ఎంలు వారి క్లస్టర్‌లోని పాఠశాలల పరిస్థితులకు అనుగుణంగా డిప్యుటేషన్ల జాబితాను తయారు చేసి మండల విద్యాశాఖ అధికారులకు, అక్కడి నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేసినట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరు ఉపాధ్యాయులు తమకు అనుకూలమైన స్కూల్ కోసం, మరికొందరు డిప్యుటేషన్ల రద్దుకోసం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ నాయకులతో పైరవీలు చేసినట్లు సమాచారం. దీంతో నోడల్ హెచ్‌ఎం నుంచి వెళ్లిన ఫైళ్లలో కొందరు ఎంఈఓల వద్ద మార్పులు జరిగినట్లు సమాచారం. అలాగే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు తమకు తెలిసిన వారికి అనుకూలమైన పాఠశాలను కేటాయించేందుకు డీఈఓ ద్వారా ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం. ఇలా నెలరోజుల క్రితం పూర్తి చేయాల్సిన ఉపాధ్యాయుల డిప్యుటేషన్ ప్రక్రియ ఇప్పటికి పూర్తి కాలేదు.

జిల్లాలో ఉపాధ్యాయుల వివరాలు

పోస్టు	మంజూరు	పనిచేస్తున్నవారు	ఖాళీలు
గ్రేడ్-2 హెచ్‌ఎం	92	53	39
ఎస్‌ఏ మ్యాథ్స్	228	215	13
ఎస్‌ఏ ఫిజిక్స్	163	157	06
ఎస్‌ఏ బయోసైన్స్	179	133	46
ఎస్‌ఏ సోషల్	212	154	58
ఎస్‌ఏ తెలుగు	73	56	17
ఎస్‌ఏ హిందీ	38	31	07
ఎస్‌ఏ ఇంగ్లిష్	158	139	19
ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	15	07	08
పీఎస్ హెచ్‌ఎం	132	66	66
ఎల్‌పీ తెలుగు	149	138	11
ఎల్‌పీ హిందీ	126	120	06
ఎస్‌జీటీ	2057	1800	257
పీఈటీ	58	55	03
డ్రాయింగ్	02	00	02
క్రాఫ్ట్	08	02	06
మొత్తం	3,690	3,126	564

సార్లు లేకపోతే చదువెలా వస్తది



పాఠశాలలో ఇంగ్లిష్, బయాలజీ, ఫిజిక్స్ చెప్పేవారు లేరు. ఇక పిల్లలు ఏం చదువుతరు. ఎలా పాస్ అయితరు.. తల్లిదండ్రులు రోజు నాపైన, హెచ్‌ఎం పైనా లొల్లి చేస్తుండ్రు. మరో పదిరోజుల్లో సార్లు రాకుంటే వేరే బడికి పంపిస్తామని అంటున్నారు. జిల్లా పెద్దసార్లు స్పందించి త్వరగా గతంలో మాదిరిగా డిప్యుటేషన్ ఇవ్వాలి.
– సంద రాంమూర్తి, ముడుపుగల్లు విద్యాకమిటీ చైర్మన్

డిప్యుటేషన్ ఇవ్వండి..



మా ఊరి బడిలో ఎప్పుడు ఏదో ఒక ఉపాధ్యాయ పోస్టు ఖాళీగానే ఉంటుంది. మూడు సంవత్సరాల నుంచి హిందీ సారు లేడు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి వరకు హిందీ చెప్పిన వారే లేరు. సారు వచ్చేదెప్పుడు, చదువు చెప్పేదెప్పుడు.. ఉన్నతాధికారులు స్పందించి డిప్యుటేషన్ మీదనైనా హిందీ సారును పంపాలి.
– మందనపు రాజు, వెంకటరాంపురం, బయ్యారం

తెలుగు, హిందీ టీచర్లు లేరు



మా ఇద్దరు అమ్మాయిలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. పాఠశాలలో హిందీ, తెలుగు చెప్పే సార్లు లేరని పిల్లలు చెబుతున్నారు. ఇప్పటి వరకు పాఠాలు చెప్పకపోతే పరీక్షలు ఎలా రాస్తారు.. ఏం రాస్తారు.
– నగేష్, కేసముద్రం విలేజ్, విద్యార్థినుల తండ్రి

ఎగరనున్న విమానం!

మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు 253 ఎకరాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం
- ఆర్టీసీలోని 3,627 మంది.. ఇక ప్రభుత్వ ఉద్యోగులు
- వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా
- ఉమ్మడి వరంగల్‌లో 32 మందికి.. తక్షణ సాయం కింద నిధులు
- కేబినెట్‌లో కీలక నిర్ణయాలు.. ఉమ్మడి వరంగల్‌కు ప్రయోజనాలు

సాక్షిప్రతినిధి, వరంగల్: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వరకు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు పది రోజుల పాటు కురిసిన వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రాజెక్టులపై ఈ కేబినెట్‌లో స్పష్టత ఇచ్చింది. ప్రధానంగా మామునూరులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి 253 ఎకరాల భూమి ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. ఏళ్లతరబడిగా ఎయిర్‌పోర్ట్ అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యన నలుగుతోంది. వెయ్యి ఎకరాల స్థలానికి గాను 270 ఎకరాలు అన్యాక్రాంతం కాగా 730 ఎకరాలకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఫెన్సింగ్ చేసింది. అయితే మరో 431 ఎకరాలు కావాలని సూచించిన అధికారులు చివరకు 253 ఎకరాలైనా పరవాలేదన్నారు. దీంతో ఎయిర్‌పోర్ట్‌కు 253 ఎకరాల స్థలం ఇచ్చేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలపడంతో త్వరలోనే మామునూరు నుంచి విమానాలు ఎగరవచ్చన్న చర్చ మొదలైంది.

ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులు..
రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టీసీ)లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ విలీనం చేసుకోవడానికి కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఆ వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఈనెల 3న అసెంబ్లీలో బిల్లు పెట్టి అమల్లోకి తేనున్నారు. దీంతో వరంగల్ రీజియన్ పరిధిలోని 9 ఆర్టీసీ డిపోలకు చెందిన 3,627 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో పాటు వివిధ కేడర్‌లకు చెందిన కార్పొరేషన్ ఉద్యోగులు ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు.

ఉమ్మడి జిల్లాకు ‘వరద’ సాయం..
ఉమ్మడి వరంగల్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల పది రోజుల పాటు కురిసిన వర్షాలు, వరదలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల కోసం రూ.500 కోట్లు కేబినెట్ కేటాయించింది. ఇందులో సుమారు రూ.237 కోట్ల వరకు ఉమ్మడి వరంగల్‌కు దక్కే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. గ్రేటర్ వరంగల్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సుమారు రూ.587 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు ఇంకా సర్వే చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ శాఖల పరిధిలో వరదల వల్ల రూ.1,000 కోట్లకుపైనే నష్టం జరిగి ఉంటుందని అంచనా. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మృతి చెందిన 32 మందికి సంబంధించి ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లకు వెంటనే తాత్కాలిక మరమ్మతు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో ఈసారి భారీగా నష్టం జరిగిందని అభిప్రాయపడిన మంత్రివర్గం.. అన్ని విధాల అండగా ఉండాలని, సీనియర్ అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని నిర్ణయించింది.

మానుకోట సిగలో మరో మణిహారం

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్: జిల్లాకు ఉద్యాన కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసింది. గిరిజనులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్న జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే ఇంజనీరింగ్ కళాశాల మంజూరై తరగతుల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ భేటీలో మానుకోటకు ఉద్యాన కళాశాల మంజూరు చేస్తూ తీర్మానం చేశారు. కాగా కళాశాల మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏటా 60మంది విద్యార్థులు బీఎస్సీ హార్టికల్చర్ విద్యను అభ్యసించనున్నారు.



కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి సత్యవతి

డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం





కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న గ్రామపంచాయతీ కార్మికులు, ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

- ఉద్రిక్తతకు దారి తీసిన జీపీ కార్మికుల ర్యాలీ

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని పలు సంఘాల నాయకులు కుంట ఉపేందర్, రేషపల్లి నవీన్, సూర్యం, శ్రీధర్, లింగ్యా హెచ్చరించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జీపీ కార్మికులు జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి దూసుకెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో జీపీ కార్మికులు అక్కడే రాస్తారోకో చేశారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట జరిగి, కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో కార్మిక సంఘాల జోక్యంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్న మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 60ప్రకారం కనీస వేతనం రూ.19,000 చెల్లించాలన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రతతో పాటు పలు సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నాయకులు కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి అప్పిరెడ్డి, నాయకులు ఆకుల రాజు, మదార్, రవి, అశోక్, సుధాకర్, జానీ, ఎల్లయ్య, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి
- ఎల్‌ఈడీ లైట్ల విషయంలో పలువురు కౌన్సిలర్ల ఆందోళన
- ఆలస్యంగా ప్రారంభమైన ఎజెండా అంశాలు
- రాత్రి వరకు సాగిన కౌన్సిల్ సాధారణ సమావేశం





మాట్లాడుతున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, హాల్‌లో బైఠాయించి ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లు

మహబూబాబాద్: అందరి సహకారంతోనే మానుకోట పట్టణ అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సీపీఐ మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి రెడ్డి, సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు ఎడ్ల వేణు, హరిసింగ్, భూక్య శ్రీను, జగన్, నీరజారెడ్డి ధర్మన్న, పద్మ, విజయమ్మ, కోఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్ ఎల్‌ఈడీ లైట్ల సమస్య పరిష్కరించాలని కోరుతూ హాల్‌లో బైఠాయించి సుమారు గంటన్నర పాటు ఆందోళన చేశారు. చివరికి చైర్మన్ ఈ విషయంపై కలెక్టర్ శశాంకతో మాట్లాడగా.. ఆయన సీడీఎంఏతో మాట్లాడినట్లు కౌన్సిలర్లు తెలిపారు. తర్వాత చైర్మన్ సీడీఎంఏతో మాట్లాడగా.. సమస్య పరిష్కరిస్తామని, ముందుగా 500 లైట్లు పంపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కౌన్సిలర్లు ఏం మాట్లాడారంటే..
మిషన్ భగీరథ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. మహిళా సంఘాల రుణాల విషయంలో మెప్మాలో అవినీతి జరిగిందని, విచారణ చేయాలని కౌన్సిలర్లు ఎడ్ల వేణు, సోమయ్య డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని గ్రీన్‌ల్యాండ్ల సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు, బుజ్జి వెంకన్న కోరారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిందని, సమస్యలు పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. అనంతరం చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మానుకోటకు రూ.50 కోట్లు విడుదల చేశారని, పలు అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల సమయంలో కౌన్సిలర్లు ఎంతో కష్టపడ్డారని, వరదల్లో చిక్కుకున్న వారి ప్రాణాలను కాపాడారని అభినందించారు. ఎజెండాలో పనులకు సంబంధించిన అంశాలు లేవని, ఆఫీస్‌కు సంబంధించిన అంశాలే ఉన్నాయన్నారు. ముందుగా పలు అంశాలపై సాయంత్రం వరకు చర్చ సాగగా.. ఎజెండాలోని అంశాలపై ఆలస్యంగా చర్చ ప్రారంభమైంది. రాత్రి 8గంటల వరకు 172 అంశాలపై చర్చ సాగగా.. ఒక అంశం పెండింగ్‌లో ఉంది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, కమిషనర్ ప్రసన్నరాణి, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై దొరవారితిమ్మాపురం చేరిన ఎమ్మెల్యే

గూడూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మట్టెవాడ జీపీ పరిధిలో 14 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో ఉన్న ఆదివాసీ గ్రామం దొరవారి తిమ్మాపురం బాహ్య ప్రపంచానికి దూరమైంది. కాగా వాగుల్లో వరద ఉధృతి తగ్గడంతో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సోమవారం ప్రజాప్రతినిధులతో కలిసి అడవిమార్గంలో ట్రాక్టర్ నడుపుతూ గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలోని 25కుటుంబాలను ఒక దగ్గరికి చేర్చి మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తానన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి భోజనం చేశారు. పరిశుభ్రత పాటించాలని, ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామం నుంచి వెనుదిరిగి వచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ సుజాత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, మట్టెవాడ సర్పంచ్ ఈసం సంధ్యారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ ఫణిధర్, ఎస్సై రాణాప్రతాప్ పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే శంకర్ నాయక్



గ్రామస్తులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

కేజీబీవీలో 50మంది విద్యార్థినులకు కళ్ల కలక



కేజీబీవీలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్

గార్ల: గార్లలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థినులకు కళ్ల కలక వ్యాధి సోకడంతో ముల్కనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు డాక్టర్ నవీన్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి కంటి చుక్కల మందును పంపిణీ చేశారు. కళ్ల కలక అంటు వ్యాధి అని, నివారణకు ప్రతీ ఒక్కరు చుక్కల మందు వాడాలన్నారు. మరొకరికి సోకకుండా కళ్లజోళ్లు పెట్టుకోవాలని సూచించారు. శిబిరంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఉషారాణి, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్ బేగ్, అనీల, పార్వతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వినతులు పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: పెండింగ్ వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని అధికారులు గుర్తు పెట్టుకోవాలన్నారు. 155 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి
జిల్లాలో వర్షాలు, వరదల వల్ల కలిగే నష్టాన్ని అంచనా వేసి, ముందస్తుగా ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇటీవల వర్షాలతో జరిగిన నష్టం, ప్రమాదాల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో జిల్లా అధికారులు మండల కేంద్రాల్లో ఉండాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు తదితర వివరాలు అందజేయాలన్నారు. రైల్వే ట్రాక్‌ల దగ్గర ఉన్న పెద్ద చెరువుల జాబితా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి పాల్గొన్నారు.

ముందస్తు ఏర్పాట్లు చేయాలి
ఎన్నికల ప్రక్రియకు కావాల్సిన సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాటుపై అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో 531పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 764పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ర్యాంపులు, తాగునీరు, ఇతర ఏర్పాట్లకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సరిపడా వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు


సదయ్య

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలం పోచంపల్లి గ్రామంలో డిసెంబర్ 19, 2019న మోటం సదయ్య తన భార్య లతను హత్య చేశాడు. ఈ ఘటనలో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 2 సంవత్సరాలు అదనంగా జైలు శిక్ష, రూ. 12వేల జరిమానా విధిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి పి నారాయణ బాబు సోమవారం తీర్పు వెల్లడించారు. మృతురాలి తల్లి బండి ప్రమీల ఫిర్యాదు మేరకు 2019లో అప్పటి సీఐ చిట్యాల సీఐ సాయిరమణ కేసు నమోదు చేసి కోర్టులో సాక్ష్యాధారాలతో సహా చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శివరాజు కోర్టులో వాదనలు వినిపించగా, సీఐ వేణు చందర్, రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, రేగొండ కోర్టు కానిస్టేబుల్ జ్యోతి సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు విన్న జడ్జి నారాయణబాబు..నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 2 సంవత్సరాలు అదనంగా జైలు శిక్ష, రూ. 12వేల జరిమానా విధించారు. కాగా, నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విషయంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన అప్పటి సీఐ సాయి రమణ, పీపీ శివ రాజు, ప్రస్తుత సీఐ వేణు చందర్,ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, సీడీవో జ్యోతి, సమన్స్ హెచ్‌జీ కుమార్‌ను ఎస్పీ కరుణాకర్ అభినందించారు.

ఎన్పీడీసీఎల్ ఉద్యోగి ఇంట్లో చోరీ

- రూ. 6లక్షల విలువైన వస్తువులు అపహరణ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీ సిరిపురంలో సోమవారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. లాకర్‌లో ఉన్న సుమారు రూ.5లక్షల విలువైన బంగారం, రూ. 35 వేల విలువైన వెండి, రూ. 35 వేల నగదు, విలువైన వస్తువులను అపహరించారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కుమ్మరి విజయ్ కుమార్ ఆదివారం రాత్రి అత్తగారింటికి వెళ్లి సోమవారం ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా లాకర్‌తో పాటు బీరువాలు తెరిచి ఉన్నాయి. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై ప్రమోద్ కుమార్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలను సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ రాజు తెలిపారు.

సైబర్ నేరగాళ్లు 'వన్‌డే' సిరీస్ ఆడేశారు..!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు

- జాన్సన్ అండ్ జాన్సన్స్ ఉత్పత్తులను చూపి రూ.కోట్లు లూటీ
- ఇన్విటేషన్ బోనస్, ఎస్‌వీఐపీ సిరీస్ అంటూ అదిరిపోయే ఆఫర్లు
- రోజూ ఆదాయం వస్తుందని... నెలల్లోనే రూ.లక్షాధికారి అంటూ వల
- నిజమని నమ్మి మోసపోయిన బాధితులు వందల్లో ఉండే అవకాశం
- ఇప్పటికే ఈ కంపెనీ యాప్‌లో డబ్బులు పెట్టొద్దంటున్న పోలీసులు





సాక్షి, వరంగల్: మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలు నయా పంథాలో సాగుతున్నాయి... జాన్సన్ అండ్ జాన్సన్స్ కంపెనీ పేరుతో ఏకంగా డార్క్ వెబ్‌లో ఓ వెబ్‌సైట్, యాప్ క్రియేట్ చేసి...మీరు కంపెనీ ఉత్పత్తులపై పెట్టే పెట్టుబడి మూడింతలకుపైబడి రిటర్న్ ఆదాయం వస్తుందంటూ ఆశ చూపారు. వన్‌డే సిరీస్, ఎస్‌వీఐపీ సిరీస్‌లతో మభ్యపెట్టి రోజువారీగా మీ బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయంటూ..ఫలానా రోజుల్లోపు మీరు పెట్టిన పెట్టుబడికి మూడు నుంచి నాలుగింతల డబ్బు మీ బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ అవుతుందంటూ నమ్మించారు. ఇలా సైబర్ నేరగాళ్లు ఇచ్చిన బంఫర్ ఆఫర్లకు ఆకర్షితులైన వందలాది మంది...ఒకరికి తెలియకుండా ఒకరు ఈ నయా మోసం ఉచ్చులో చిక్కుకొని రూ.కోట్లలో డబ్బులు కోల్పోయారు. వరంగల్ పోలీసు కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోనూ వందలాది మంది మోసపోయినట్లు తెలిసింది. ఈ మోసం రూ.కోట్లలోనే ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు...తమకు వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ముందుకెళ్లాలని యోచిస్తున్నారు.

అదిరిపోయే ఆఫర్లతో వల...

కూర్చున్నచోటనే రూ.వేల నుంచి రూ.లక్షలు వస్తాయంటే ఎవరూ వదులుకుంటారు. అయితే ఈ ఈజీమనీ మోసమని చాలామంది తొలినాళ్లలో పసిగట్టడం లేదు. వీళ్లలో విద్యావంతులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఉండడం గమనార్హం. ఏటా గొలుసు కట్టు మోసాలు ఎన్నో వెలుగులోకి వస్తున్నా కూడా...వారిచ్చే అదిరిపోయే ఆఫర్లతో ఆ మోసాలను మరిచిపోతున్నారు. రోజుల్లోనే రూ.లక్షాధికారి కావొచ్చని కలలు కంటున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారి చేతిలో ఉన్న డబ్బులు కూడా కనిపించని చోటుకు తరలిపోతున్నాయి.

యాప్‌లో డబ్బు కనబడినా... ఖాతాల్లో క్రెడిట్ కాదు...

ఈ కంపెనీ ఉత్పత్తులపై పెట్టుబడులు పెట్టిన చాలామందికి తొలినాళ్లలో బాగానే డబ్బులు జమ అయినా...ఆ తర్వాత కావడం లేదు. ఇదేంటని అడిగితే ఇంకొందరిని ఇందులో చేర్పిస్తే మీ డబ్బులు జమఅవుతాయంటారు. ఆ తర్వాత వారు బాధితుల ఖాతాల్లో వేసిన డబ్బు సంబంధిత కంపెనీ యాప్‌లో డిపాజిట్ అయినట్లు చూపిస్తుంది. బ్యాంక్‌లోకి తీసుకునేందుకు వెళ్తే ఖాతాలో చూపించకపోవడంతో వారిని చాట్ రూపంలో సంప్రదిస్తే మరో 24 గంటల సమయం క్రెడిట్ అయ్యేందుకు సమయం పడుతుందని నమ్మిస్తారు. ఆ తర్వాత సర్వర్ డౌన్ అయి క్రెడిట్ కాలేదంటారు. ఆ తర్వాత సంబంధిత కంపెనీకి ఫోన్ చేద్దామన్నా రెస్పాండ్ కారు. చాట్ చేసినా కూడా స్పందించరు. అయితే ఈ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ. రంగనాథ్ కోరారు.

ఇన్విటేషన్ బోనస్ అంటూ..ఆశ పెడతారు..

- హైజానిక్ మాస్క్ రూ.6,800 ఇన్వెస్ట్ చేస్తే 52 రోజుల వరకు దినసరి ఆదాయం రూ.408 వస్తుందని...ఇలా రూ. 21,216 వస్తుందంటారు. దాదాపు 312 శాతం రిటర్న్‌గా వస్తుందంటారు.
- బీపీ మిషన్ ప్రాడక్ట్‌పై రూ. 15,800 ఇన్వెస్ట్ చేస్తే 54 రోజుల వ్యవధిగానూ రోజుకు రూ.1027 చొప్పున మొత్తం రూ. 55,458 వస్తుందంటారు. ఓవరాల్‌గా 351 శాతం రిటర్న్ వస్తుందంటారు.
- స్కానింగ్ మిషన్‌పై రూ. 1,43,000 పెట్టుబడి పెడితే 62 రోజుల వ్యవధికిగానూ రోజుకు రూ.11,011 చొప్పున మొత్తం రూ.6,82,682 వస్తుందని నమ్మిస్తారు. ఇలా 477.4 శాతం రిటర్న్ వస్తుందంటారు. వీటికి సంబంధించిన ఇన్విటేషన్ లింక్‌లను ఒకరికి పంపిస్తే రూ.400 నుంచి రూ.900 వరకు, ఇద్దరికి పంపిస్తే రూ.500 నుంచి రూ.1,000 వరకు, ముగ్గురికి పంపిస్తే రూ.600 నుంచి రూ.1100 వరకు ఆయా ఉత్పత్తులను బట్టి ఇన్విటేషన్ బోనస్ వస్తుందని నమ్మిస్తారు. అప్పటికే వివిధ ప్రాడక్ట్‌లపై డబ్బులు పెట్టినా బాధితులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇతరులకు లింక్‌లు పంపి తమ డబ్బు వస్తుందన్న ఆశతో ఉన్నారు.

ఎస్‌వీఐపీ సిరీస్‌తో లక్షాధికారులే...

సింగపూర్‌లో జాయింట్ ఎగ్జిబిషన్‌లో భాగంగా సరికొత్తగా ప్రాడక్ట్ ప్రారంభించాం. ప్రజల ఆరోగ్యానికి సంబంధించి మరిన్ని ఉత్పాదకాలు తీసుకొస్తాం. ఈ కొత్త ప్రాడక్ట్‌లు లిమిటెడ్‌గా ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్‌గా రీచార్జ్ చేసుకోండి. ఇది మిస్ కాకుండా చూసుకోండి. చాలా మంది ప్రజలు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారంటారు. ఇందులో ఆరోగ్య ఉత్పత్తులతో పాటు ల్యాప్‌టాప్‌లను కూడా అందుబాటులో ఉంచారు. ఒక ల్యాప్‌టాప్ ధరను రూ.1,50,000గా నిర్ధారిస్తారు. 25 రోజుల వ్యవధిగా నిర్ణయిస్తారు. రోజుకు ఆదాయం రూ.45,000 వస్తుందని కోట్ చేస్తారు. అలా మొత్తం ఆదాయం 25 రోజుల్లో రూ. 11,25,000 వస్తుందని సంబంధిత సైట్‌లో ప్రాజెక్ట్ చేస్తారు. ఇది నమ్మిన చాలామంది పెట్టుబడులు పెట్టి మోసపోయారని తెలిసింది.



లింక్‌లతో 'కట్టి' పడేస్తారు...

జాన్సన్ అండ్ జాన్సన్స్ అనగానే చాలామందికి వైద్యరంగానికి సంబంధించిన ఉత్పత్తులు...ముఖ్యంగా పిల్లలకు సంబంధించిన ప్రాడక్ట్‌లు గుర్తుకొస్తుంటాయి. అయితే అది జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ. దీనినే ఆసరా చేసుకున్న సైబర్ నేరగాళ్లు.. జాన్సన్ అండ్ జాన్సన్‌కు బదులు జాన్సన్ అండ్ జాన్సన్స్ అంటూ ఓ వెబ్‌సైట్, యాప్ క్రియేట్ చేశారు. దీనికి ఆకర్షితులై ఆయా ఉత్పత్తులపై పెట్టుబడి పెట్టి మూడింతలకుపైగా రిటర్న్ ఆదాయం వస్తుందంటూ అందులో చేరిన వారు ఇతరులకు ఇన్విటేషన్ లింక్‌లు పంపిస్తున్నారు. జాన్సన్ కో.వీఐపీ/హెచ్5 లింక్‌ను క్లిక్ చేస్తే యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఇస్తారు. ఆ తర్వాత మీరు ఏదైనా ప్రాడక్ట్‌పై డబ్బు పెట్టాక...రెండు రోజుల నగదు మీ ఖాతాలో జమ అవుతుంది. ఆ తర్వాత రావాలంటే ఆ లింక్‌ను ఇతరులకు ఇన్విటేషన్ పంపి చేర్పిస్తేనే జమ అవుతుందని లింక్ పెడతారు. ఇలా ఈ ఊబిలో తెలిసి మరీ అందరూ చిక్కుకుంటున్నారు.

వన్‌డే సిరీస్ అంటూ ఊరిస్తారు...

ఈ ఆఫర్ ఈ ఒక్కరోజే ఉంటుంది. ఆలస్యం చేస్తే మీరు అరుదైన అవకాశం కోల్పోతారంటూ సభ్యులకు వాట్సాప్ మెసేజ్‌లు చేస్తారు. ఇందులో ఉదాహరణకు సోఫాసెట్‌ను రూ.75,000 ధర నిర్ధారిస్తారు. 35 రోజుల కాల వ్యవధి ఉంటుంది. రోజుకు రూ.8,250 ఆదాయం వస్తుందని కోట్ చేస్తారు. ఇలా 35 రోజుల్లో రూ.2,88,750 ఆదాయం వస్తుందని స్క్రీన్‌పై చూపిస్తారు. ఇందులో కూడా చాలామంది పెట్టుబడులు పెట్టారు.

పోలీస్ అధికారుల బదిలీ..

వరంగల్ క్రైం : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రాత్రి జరిగిన ఏసీపీల బదిలీలలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పలువురికి స్థాన చలనం కలిగింది.

ఏసీపీలు : వి.సురేష్ కామారెడ్డి నుంచి వర్ధన్నపేట, సుందరగిరి శ్రీనివాస్‌రావు వర్ధన్నపేట నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, గజ్జి కృష్ణ ఖమ్మం సీసీఆర్‌బీ నుంచి వరంగల్ సీసీఆర్‌బీ, బంటు కిషన్ సీసీఆర్‌బీ వరంగల్ నుంచి హైదరాబాద్ డీజీపీ ఆఫీస్,జి.వెంకటేశ్వరాబాబు జగిత్యాల నుంచి తొర్రూరు, ఏ.రఘు తొర్రూరు నుంచి హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ విభాగం, దురిశెట్టి రఘుచందర్ స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి డీసీఆర్‌బీ జగిత్యాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మల్టీజోన్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..

రాష్ట్రంలోని మల్టీజోన్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నార్త్‌జోన్ ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.కన్నం కుమారస్వామి వరంగల్ సీసీఆర్‌బీ నుంచి ఖమ్మం 2టౌన్, పిట్టల వెంకన్న ఎస్‌బీ నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్, పత్తిపాక దయాకర్ వరంగల్ నుంచి ములుగు సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

వరంగల్ కమిషనరేట్ పరిధిలో..

ఇన్‌స్పెక్టర్లు : ఎస్.రవికుమార్ వరంగల్ సీసీఎస్ నుంచి నర్సంపేట టౌన్, పులి రమేష్ నర్సంపేట టౌన్ నుంచి వీఆర్ వరంగల్, పుల్యాల కిషన్ ఎస్‌బీ వరంగల్ నుంచి నర్సంపేట రూరల్, కె.సూర్యప్రసాద్ నర్సంపేట రూరల్ నుంచి వీఆర్ వరంగల్, టి.రవికుమార్ వీఆర్ వరంగల్ నుంచి వరంగల్ పీటీసీకి బదిలీ అయ్యారు.

సబ్ ఇన్‌స్పెక్టర్లు : బొంగు మాధవ్ మిల్స్‌కాలనీ నుంచి ఖానాపూర్, పిట్టల తిరుపతి ఖానాపూర్ నుంచి మిల్స్ కాలనీ, ఎస్.రవి మహబూబాబాద్ నుంచి నర్సంపేట టౌన్‌కు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రైం డీసీపీ మురళీధర్‌కు ఐపీఎస్ హోదా


మురళీధర్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో క్రైం డీసీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న దాసరి మురళీధర్‌కు ఐపీఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ముగ్గురు డీసీపీ స్థాయి అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఐపీఎస్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాసరి మురళీధర్ 2010లో డీఎస్పీ ఉద్యోగం సాధించి, శిక్షణ అనంతరం మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా మార్కాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కృష్ణ జిల్లా గుడివాడ, వరంగల్ నర్సంపేట, సీఐడీ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2017లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లా అదనపు ఎస్పీగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అదనపు డీసీపీగా పనిచేశారు. 2021లో డీసీపీలో పదోన్నతి పొందారు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్‌లో క్రైం డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. దాసరి మురళీధర్ ఐపీఎస్ హోదా పొందటంపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాకేష్‌పై హత్యాయత్నం

కాజీపేట: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని హత్య చేయడానికి యత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సార్ల రాజు తెలిపారు. కాజీపేట మండలం సోమిడికి చెందిన రాకేష్‌కు అదే కాలనీకి చెందిన హుస్సేన్, లాల్‌పాషా, సాయిరాంకు మధ్య 2018 నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి రాకేష్ దర్గా కాజీపేట జెండా గద్దె వద్దకు ఒంటరిగా రాగా, అతనిపై నిందితులు దాడికి యత్నించారు. దీంతో రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దంతాలపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గున్నెపల్లిలో జరిగింది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం గ్రామానికి చెందిన బత్తిని సురేష్(35)కు తన కుటుంబ సభ్యులతో సోమవారం రాత్రి గొడవ జరిగింది. గొడవ జరిగిన గంట వ్యవధిలోనే సురేష్ కత్తితో పొడుచుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న తొర్రూరు సీఐ సత్యనారాయణ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపడుతున్నారు. కాగా, సురేష్ మృతిపై వివరాలు తెలియాల్సి ఉంది.

పసుపు ధర పైపైకి..

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.11,352

కేసముద్రం : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పసుపు ధర రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,352, కనిష్ట ధర రూ.5000 పలికింది. గోళారకం పసుపు క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,250, కనిష్ట ధర రూ.7801 పలికింది. కాగా, మార్కెట్‌కు సుమారు 120 బస్తాల పసుపు అమ్మకానికి వచ్చిందని మార్కెట్ అధికారులు తెలిపారు. ఇందులో కేసముద్రంవిలేజ్‌కి చెందిన మేకల వెంకన్న 20 బస్తాలు తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,352 పలికింది. దీంతో ఆ రైతు ఆనందం వ్యక్తం చేశాడు.


కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు

రోకలితో కొట్టి చంపిన భర్త

- అదనపు కట్నం కోసం ఘాతుకం..
- జారిపడి మృతి చెందినట్లు చిత్రీకరించే ప్రయత్నం
- ఒడిపిలవంచలో ఘటన


సంధ్య (ఫైల్)


గణేష్

కాటారం: పచ్చని పందిరి.. నుదిటిన బాసింగం.. నెత్తిన జీలకరబెల్లం.. మూడు ముళ్లు.. ఏడు అడుగులతో వేదమంత్రాల సాక్షిగా, పంచభూతాల సమక్షంలో ఒక్కటయ్యే దంపతులు జీవితాంతం ఒకరికొకరు తోడు, నీడగా ఉండాలి. భర్తకు బాధవస్తే భార్య.. భార్యకు ఆపద వస్తే భర్త.. ఒకరికష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకుంటూ చివరి మజిలీ వరకు కలిసి మెలిసి ఆనందంగా ఉండాలి. అప్పుడే వివాహానికి పరమార్థం ఉంటుంది. అలా ఉంటుంది కాబట్టే హిందూ సమాజంలో పెళ్లి అనే బంధానికి అంత గొప్పతనం ఉంటుంది. అయితే డబ్బు వ్యామోహంతో కొందరు ఈ బంధానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ తమ బంధాన్ని ఆదిలోనే తుంచుకుంటున్నారు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. అదనపు కట్నం కోసం కొన్నేళ్లుగా భార్యను వేధింపులకు గురి చేస్తున్న ఓ కిరాతకుడు.. చివరకు ఆమె ప్రాణం తీశాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఒడిపిలవంచలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాటారం మండల కేంద్రానికి చెందిన సంధ్య(27)కు ఒడిపిలవంచకు చెందిన చిగురు గణేష్‌కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి శ్రీతన్, కృషి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహ సమయంలో గణేష్‌కు రూ.5 లక్షలు, పది తులాల బంగారం కట్నం కింద సంధ్య తల్లిదండ్రులు ముట్టజెప్పారు. వివాహ అనంతరం కొన్ని రోజుల తర్వాత గణేష్ అదనపు కట్నం కోసం సంధ్యను వేధించడం మొదలుపెట్టాడు. దీనిపై సంధ్య తల్లిదండ్రులు పలుమార్లు పంచాయితీలు నిర్వహించి ఒకసారి రూ.2 లక్షలు, మరోసారి రూ.1.50 లక్షలు అదనంగా ముట్టజెప్పారు. అయినా సంతృప్తి చెందని గణేష్ ఈ వేసవికాలంలో సంధ్యతో గొడవ పెట్టి అదనపు కట్నం కోసం పుట్టింటికి వెళ్లగొట్టాడు. పది రోజుల క్రితం సంధ్య తల్లిదండ్రులు రూ.లక్షతో పాటు తమ కూతురిని తీసుకొచ్చి అల్లుడికి అప్పజెప్పారు. ఈ క్రమంలో ఇంకా అదనపు కట్నం కావాలని గణేష్ ఆదివారం అర్ధరాత్రి తన భార్యతో గొడవపడి సోమవారం తెల్లవారుజామున రోకలితో కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని ఇంటి ముందు మెట్లపై వేసి బురద కారణంగా జారి పడి మృతి చెందిందని చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. కాగా, ఘటనా స్థలిని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రంజిత్‌రావు, ఎస్సై అభినవ్, భూపాలపల్లి తహసీల్దార్ ఇక్బాల్ పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకొని పంచానామ జరిపారు. మృతురాలి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. నిందితుడు గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొచి విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

కాంట్రాక్ట్ వర్కర్‌కు సన్మానం


యుగంధర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక

సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'విద్యుత్ ఇచ్చి వ్యవ 'సాయం'' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ శశాంక స్పందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గార్ల పెద్ద చెరువులో ఉన్న స్తంభంపై వైర్లు దెబ్బతిని వ్యవసాయానికి సరఫరా నిలిచింది. దీంతో పంటల ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుడు గట్టు యుగంధర్ తన ప్రాణం లెక్కచేయకుండా చెరువులో అర కిలోమీటర్ మేర ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేసి 3- ఫేజ్ కరెంట్ పునరుద్ధరణకు కృషి చేశాడు. దీంతో సోమవారం కలెక్టర్ శశాంక కలెక్టరేట్‌లో యుగంధర్‌ను సన్మానించారు. అదే విధంగా ఆయనకు తోడుగా వెళ్లిన రైతు లక్ష్మారెడ్డిని కూడా కలెక్టర్ సన్మానించారు. ఆగస్టు 15వ తేదీన కలెక్టరేట్‌కు రావాలని యుగంధర్‌ను కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్, డీఈలు విజయ్, సునీత, ఏఈ మహేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.మధురిమ


మాట్లాడుతున్న హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారి మధురిమ

హన్మకొండ: మానవ అక్రమ రవాణా నేరమని, దీనిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.మధురిమ అన్నారు. మానవ అక్రమ రవాణా వ్య తిరేక దినం పురస్కరించుకుని సోమవారం హనుమకొండ సుబేదారిలోని అసుంతా భవన్‌లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా 'మానవ అక్రమ రవాణకు గురైన ప్రతి ఒక్కరూ రక్షించబ డాలి' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ, బాలల అక్రమ రవాణా దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉందని, ఇటీవల మరింతగా విస్తృతమవుతూ వివిధ రూపాలను సంతరించుకుందన్నారు. దీనిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సంస్థ ప్రోగ్రాం అధికారి ఎర్ర శ్రీకాంత్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అని ల్ చందర్ రావు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పి.సంతోష్ కుమార్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ రాగి కృష్ణ మూర్తి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మహబూబాబాద్ జిల్లా చైర్‌పర్సన్ ఎస్.నాగవాణి, మాజీ చైర్మన్ మండల పరశురాములు, సభ్యులు కె.దామోదర్, సందసాని రాజేంద్రప్రసాద్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎస్.శ్రీనివాస్, పోలీసు ఇన్‌స్పెక్టర్లు వెంకట్రామ్, గోపి, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు తీసుకుని మోసం చేశారు


ఆందోళన చేస్తున్న బాధితురాలు బాస్కుల త్రివేణి

కాశిబుగ్గ: అప్పు తిరిగి ఇవ్వాలంటూ బాకీదారుడి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఓ మహిళ నిరసన తెలిపింది. ఈ ఘటన సోమవారం గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ లేబర్‌కాలనీలో జరిగింది. బాధితురాలు బాస్కుల త్రివేణి కథనం ప్రకారం ఆమె భర్త సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బాస్కుల శ్రీనివాస్ బతికి ఉన్నప్పుడు బోనగిరి దేవేందర్, రాధిక దంపతులు మూడేళ్ల క్రితం రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అనంతరం వాయిదా ప్రకారం చెల్లించకపోవడంతో పెద్ద మనుషుల సమక్షంలో వడ్డీతో కలిసి రూ.13 లక్షలు చెల్లిస్తానని, లేకుంటే లేబర్‌కాలనీలోని ఇల్లును శ్రీనివాస్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తానని అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆతర్వాత దేవేందర్, రాధిక దంపతుల లేబర్‌కాలనీ నుంచి వెళ్లిపోయారు. అదే క్రమంలో లేబర్‌కాలనీలో 'కల్పవల్లి అసోసియేట్స్, ఫైనాన్స్, ట్రేడర్స్' యజమాని ఐపీ పెట్టడంతో అందులోనూ నష్టపోయినట్లు భావించిన త్రివేణి భర్త శ్రీనివాస్.. తీవ్ర మనస్తాపానికి గురై గుండె పోటుతో మృతి చెందాడు. ఈక్రమంలో చేసేదేమీ లేక ఇటీవల మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రూ.11 లక్షల 50 వేల ఇస్తానని దేవేందర్ దంపతులు ఒప్పుకుని ఇంతవరకు ఇవ్వలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు.

వేతనాల పెంపు నిర్ణయంపై 108 సిబ్బంది హర్షం

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని 108 సిబ్బందికి 4వ స్లాబ్ అమలు చేస్తూ టెక్నీషియన్లకు రూ.30 వేలు, పైలట్లకు రూ.28 వేలకు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల 108 సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో జిల్లా 108 ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లకావత్ బాలాజీ నాయక్, బోయినపల్లి దేవేందర్‌రావు, నాయకులు సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు చైతన్య, దస్తగిరి హరికృష్ణ, కృష్ణ, సురేందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి హరీశ్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న 108 ఉద్యోగ సంఘం నాయకులు

ఉమ్మడి జిల్లాకు కొత్తగా 108, 102 వాహనాలు

హన్మకొండ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన 108, 102 అత్యవసర సేవల వినియోగ వాహనాలను ఉమ్మడి జిల్లాకు కేటాయించింది. ఈ వాహనాలు మంగళవారం సాయంత్రానికి జిల్లాకు రానున్నాయి. బుధవారం నుంచి సేవలు అందిస్తాయి. కాగా, ఇందుకు సంబంధించిన వివిధ స్థాయి సిబ్బంది నియామక ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని 108 సర్వీసుల ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ తెలిపారు. హనుమకొండ జిల్లాకు 108 వాహనాలు 08, 102 వాహనాలు 04, పార్థీవదేహం తరలించే వాహనం 01 కేటాయించినట్లు తెలిపారు. అదే విధంగా మహబూబాబాద్ జిల్లాకు 108 వాహనాలు 05, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 08, ములుగు జిల్లాకు 08, వరంగల్ జిల్లాకు 04, జనగామ జిల్లాకు 05, అదే విధంగా 102 వాహనాలు మహబూబాబాద్ 06, జయశంకర్ భూపాలపల్లి 01, ములుగు 07, వరంగల్ 04, జనగామ జిల్లాకు 05, కేటాయించారు. మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఒక్కొక్కటి చొప్పున పార్థీవదేహాలను తరలించే వాహనాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ మేరకు కొత్త వాహనాలతో ప్రజలకు మరింత మెరుగైన అత్యవసర సేవలు అందించే అవకాశాలు ఉంటాయని శివకుమార్ తెలిపారు.

